క్లుప్తంగా

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేదమంత్రోచ్చరణల మధ్య అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం ఉదండాపురం గ్రామానికి చెందిన పరశురాముడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతడి స్నేహితులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం రూ.37వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, ప్రజాపతి, నర్సింహారెడ్డి, నర్సింహాగౌడ్, ప్రవీణ్, పరుశరాం పాల్గొన్నారు.

కమాండెంట్‌కు సన్మానం



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పదో పటాలం కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సాంబయ్యను శనివారం సర్పంచ్ జోగుల రవి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటన్న, శాంతన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల తహసీల్దార్‌కు..

ఇటిక్యాల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంజిపేట రాజు, గోపి, వెంకటేష్, రమేష్, రఘు, సాగర్, నవీన్ పాల్గొన్నారు.

క్యాతూర్‌లో హైకోర్టు జీపీ



అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో ఏజీపీ నర్సింహ ఇంట్లో సోమవారం నిర్వహించిన తీనేటి విందుకు హైకోర్టు గవర్నమెంట్ ప్లీడర్ (జీపీ), బార్ కౌన్సిల్ సభ్యుడు భైరపాక జయకర్ హాజరయ్యారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా తొరూరు ఏజీపీ వీరదాస్, ఎంఎల్ఎఫ్ వెంకటరత్నం, జాతీయ ఉపాధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: ఇంటి స్థలం విషయంలో ఇద్దరిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఎర్రవల్లికి చెందిన ఉప్పరి రాములమ్మ, చిన్నరాముడికి ఇంటి స్థలం విషయంలో గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో స్థలం సమస్యను పరిష్కరించేందుకు ఆదివారం గ్రామపెద్దల సమక్షంలో ఇరు వర్గాలను పిలువగా.. మాటామాట పెరగడంతో చిన్నరాముడు, మొగిలి కృష్ణ, ఆంజనేయులు కోపంతో రాములమ్మ, ఆమె భర్త గోవిందుపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుల కుమారుడు బీచుపల్లి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుడిసె దగ్ధం

ఉండవెల్లి: మండలంలోని మారమునగాల-1 గ్రామానికి చెందిన అనసూయమ్మ నివాస గుడిసె సోమవారం దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు.. సాయంత్రం దేవుడి చిత్రపటాల ముందు దీపం వెలిగించి శివాలయానికి వెళ్లగా, ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొంది. చుట్టుపక్కల వారు అప్రమత్తమై గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను బయటికి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. గుడిసెలో ఉన్న నిత్యావసర సరుకులతోపాటు ఎలక్ట్రికల్ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.లక్ష వరకు ఆస్తినష్టం వాటిల్లిందని బాధితురాలు వాపోయింది.

ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం

పెబ్బేరు రూరల్: క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుదాం అని సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్టా ఆంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, కురుమయ్య పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణ కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలన్నారు. ఆగస్టు 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా 14 సంఘాల ఆధ్వర్యంలో మహాధర్నా చేపడతున్నామని తెలిపారు. మదన్, కురుమయ్య, విజయకుమార్, నందిమళ్ల రాములు, నరేష్ ఉన్నారు.

ప్రజల మదిలో గద్దర్‌కు సుస్థిర స్థానం



అలంపూర్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: ప్రజాయుద్ధనౌక గద్దర్ భౌతికంగా లేనప్పటికీ ప్రజల మదిలో ఆయన గానం సుస్థిరంగా ఉంటుందని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్దర్ తన పాటలతో కోట్లాది మందిని చైతన్య పరిచారన్నారు. ఆయన మృతి తీరని లోటన్నారు. అదేవిధంగా జాతీయ రహదారి ఫ్లెఓవర్ కూడలిలో ఎమ్మార్పీఎస్ నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మస్తాన్ మాదిగ, ఏలీషా, జాన్, నరేంద్ర, మద్దన్న, రంగముని, నర్సన్‌గౌడ్ పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: నేటితరం కళాకారులకు గద్దర్ స్ఫూర్తిదాయకమని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎస్.ఆశన్న అన్నారు. మండలంలోని లింగన్‌వాయిలో మండలి జిల్లా అధ్యక్షుడు లలీ అక్బర్ ఆధ్వర్యంలో గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీకే ఈదన్న, సుదీప్, ఎల్ఐసీ మద్దిలేటి, శ్రీరామ్, రామచంద్రుడు, వెంకట్, విజయ్‌గౌడ్, గోవర్ధన్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అయిజ: ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ప్రజా సంఘాల నాయకులు హైదరాబాద్‌కు బయలుదేరారు. అదేవిధంగా ఎక్లాస్‌పూర్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విజయభాస్కర్‌రెడ్డి, వినోద్‌కుమార్, అంజనేయులు, కిష్టన్న, అంజి, నర్సింహులు, ఆనందరాజు, ప్రభాకర్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

శాంతినగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజాగాయకుడు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు, రాఘవేంద్ర, బీసన్న, జీవ జయరాజు, మహేష్, జలంధర్, భరత్‌బాబు పాల్గొన్నారు.



శాంతినగర్ డిగ్రీ కళాశాలలో..



అయిజ మండలం ఎక్లాస్‌పూర్‌లో..

తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ హేమలత

గద్వాల అర్బన్: తల్లిపాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ హేమలత అన్నారు. జిల్లా కేంద్రంలోని 14, 15, 16 వార్డుల అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, ఆరునెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని తెలిపారు. తల్లులు పిల్లలకు పాలివ్వడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవన్నారు. చిన్నారులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, ఐసీడీఎస్ ద్వారా అమలవుతున్న అన్ని పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా గర్భిణులు ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. జిల్లాలో తల్లిపాల వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. గద్వాల, మల్దకల్, మానవపాడు మండలాల్లో మూడు ప్రాజెక్టులు ఉండగా.. 713 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ముర్రుపాలలో పోషకాలు అధికంగా ఉంటాయని, బిడ్డ పుట్టిన వెంటనే తప్పనిసరిగా పట్టించాలని సూచించారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం డాక్టర్ రిజ్వానా తస్నీమ్ 30మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా న్యూట్రిషన్ కిట్ అందిస్తున్నట్లు తెలిపారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చంద్రన్న, సంధ్యారాణి, తిరుమలరావు, సోని, జయ్యమ్మ, షాజహాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆరోగ్యశ్రీ దినోత్సవం

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ ప్రజావైద్యశాలలో సోమవారం ఎమ్మార్పీఎస్ నాయకుడు జంబయ్య ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బండారి డేవిడ్ హాజరై గర్భిణులకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ పోరాటాల ఫలితంగా ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న విశ్వరూప మహాసభకు మాదిగలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జగ్గన్న, వినోద్ పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం విశ్వకవి, జాతీయ గీతం సృష్టికర్త రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రవీంద్రనాథ్ ఠాగూర్ రచయిత మాత్రమే కాదని, శాంతి నికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు భీమసేనరావు, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వెంకటేష్, చేనేత జిల్లా కోకన్వీనర్ బండ శివన్న, పట్టణ ఎస్సీమోర్చా అధ్యక్షుడు రఘు, ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల సర్పంచ్ హురునిస్సాబేగం తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అబ్రహం సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట మజీద్‌మియ్యా ఉన్నారు.

రైల్వేగేట్ మూత.. వాహనాల దారి మళ్లింపు



స్లీపర్ల సర్దుబాటు పనులు చేస్తున్న సిబ్బంది

ఉండవెల్లి: జోగుళాంబ రైల్వేగేట్ వద్ద సోమవారం స్లీపర్స్ (పట్టాల దిమ్మెలు) సర్దుబాటు పనులు చేపట్టారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రధాన రహదారిపై ఉన్న రైల్వేగేట్‌ను మూసివేశారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అలంపూర్ చౌరస్తా నుంచి వచ్చే వాహనాలను ఉండవెల్లి మీదుగా డి.బూడిదపాడువైపు మళ్లించారు. రైల్వేగేట్ వద్ద 6 స్లీపర్లను తొలగించి కొత్త దిమ్మెలను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

చేనేత కార్మికులకు సన్మానం



రాజోళి: మండల కేంద్రంలో సోమవారం చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కొన్నేళ్లుగా విశిష్ట సేవలు అందిస్తున్న కార్మికులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత రంగంలో ఒడిదుడుకులను తట్టుకుని తమ నైపుణ్యాన్ని చాటుతున్న కార్మికులకు మరింత ప్రోత్సాహం ఇవ్వాలన్నారు.

విలేకరిపై మున్సిపల్ ఉద్యోగి దాడి

గద్వాల క్రైం: వివాద సంఘటన వ్యవహారాన్ని వీడియో తీస్తున్న ఓ విలేకరిపై మున్సిపల్ ఉద్యోగి దాడి చేసిన సంఘటన సోమవారం గద్వాల మున్సిపల్ కార్యాలయంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా.. గద్వాలలోని మున్సిపల్ కాంప్లెక్స్‌కు సంబంధించి 7వ నంబర్ షాపును విజయలక్ష్మి అనే మహిళ టెండర్ల ద్వారా దక్కించుకోగా.. మున్సిపల్ కాలపరిమితి పొడిగింపుపై ఆమె, బంధువులు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీంతో షాపునకు ఎలాంటి టెండర్లు వేయరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మున్సిపల్ శాఖ టెండర్లు ప్రకటించి మరొకరికి షాపును కేటాయించింది. దీంతో షాపును ఖాళీ చేయించేందుకు సాయంత్రం గద్వాల మున్సిపల్ సిబ్బంది అక్కడికి వెళ్లి షాపును మూసివేయడంపై విజయలక్ష్మి బంధువు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామసాయిబాబ కార్యాలయంలోని ఆర్ఓ రాములును ప్రశ్నించింది. దీనిని గమనించిన ఓ విలేకరి తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరిస్తుండగా ఆర్ఓ ఫోన్ లాక్కుని అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేశారు. ఈ విషయమై పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. అలాగే మున్సిపల్ ఆర్ఓ రాములు స్పందిస్తూ తాను ఎవరిపై దాడి చేయలేదని, ప్రభుత్వ నిబంధనల ప్రకారమే దుకాణానికి సిబ్బంది తాళం వేశారన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అనుమతుల పేరుతో అక్రమ దందా
- భారీగా ఇసుక నిల్వలు
- పట్టించుకోని అధికారులు



రాజోళిలో ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్



మండల కేంద్రం సమీపంలో నిల్వ చేసిన ఇసుక

రాజోళి: ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అనుమతుల పేరుతో అక్రమ దందా సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించి నిల్వ చేసుకుంటున్నారు. మండలంలో ఎక్కడ చూసినా ఇసుక డంపులు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రజల అవసరాల కోసం కొన్ని అనుమతులు ఉన్నప్పటికీ.. కొందరు వాటిని అడ్డు పెట్టుకుని అక్రమ దందా సాగిస్తున్నారు. తుంగభద్ర నది నుంచి వాహనాల్లో ఇసుకను తరలించి బహిరంగంగా డంపింగ్ చేస్తున్నారు. ఇసుక నిల్వలను సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పట్టపగలే అక్రమ దందా సాగిస్తున్నా పోలీసులు, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. తప్పని పరిస్థితుల్లో నామమాత్రంగా తనిఖీలు చేసి వదిలిపెడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఉన్నట్లయితే వాహనదారుల సొంత స్థలాల్లో ఎందుకు డంపింగ్ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుమతులివ్వని అధికారులు.. ఇలా అడ్డగోలుగా ఇసుకను రవాణా చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

నడిగడ్డతో ప్రత్యేక అనుబంధం



గద్వాలలో గద్దర్ ఆటపాట (ఫైల్)



అంతిమయాత్రలో పాల్గొన్న నడిగడ్డ వాసులు

- గద్దర్ మృతిని జీర్ణించుకోలేకపోతున్న అభిమానులు
- కడసారి కన్నీటి వీడ్కోలు

గద్వాల రూరల్: ప్రజాయుద్ధనౌక గద్దర్ మరణాన్ని నడిగడ్డ జనం జీర్ణించుకోలేపోతున్నారు. ఆయనకు గద్వాలతో ప్రత్యేక అనుబంధం ఉంది. 2000–23 వరకు గద్దర్ నేతృత్వంలో ఏర్పడిన తెలంగాణ జనసమితి, తెలంగాణ ప్రజాఫ్రంట్‌లకు నడిగడ్డ వాసైన మద్దిలేటి రాష్ట్ర సారథిగా బాధ్యతలు నిర్వర్తించి కీలకపాత్ర పోషించారు. 1980, 90 దశకంలో ఈప్రాంతం నుంచి చాలా మంది యువత విప్లవోద్యమంవైపు కదం తొక్కారు. వారందరికీ గద్దర్‌తో స్నేహం, విడదీయరాని బంధం ఉంది. మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు దివంగత నేత పటేల్ సుధాకర్‌రెడ్డి చనిపోయినప్పుడు.. ఆయన అంత్యక్రియలు స్వగ్రామమైన మల్దకల్ మండలం కుర్తిరావుల్‌చెర్వులో జరిగాయి. ఆ సందర్భంగా గద్వాలలో జరిగిన అంతిమ యాత్రలో గద్దర్ పాల్గొని తన పాటలు, ఆటతో తుది నివాళి అర్పించారు. అదేవిధంగా తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు పులిమామిడి మద్దిలేటి మృతి చెందినప్పుడు అంత్యక్రియలకు హాజరయ్యారు. మలిదశ తెలంగాణ ఉద్యమం సందర్భంగా గద్వాల తేరు మైదానంలో తెలంగాణ ఆటపాట, మాటలతో జనాల్లో ఉద్యమాన్ని రగిలించారు. తన తుది శ్వాస వరకు పీడిత ప్రజానీకం పక్షాన నిలబడి గొంతుకను వినిపిస్తున్న గళం శాశ్వతంగా మూగపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

అంతియాత్రకు అశేష సంఖ్యలో...

హైదరాబాద్‌లో నిర్వహించిన గద్దర్ అంతిమ యాత్రకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, ఆయన శిష్యులు, ప్రజలు తరలివెళ్లారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కన్నీటిపర్యాంతమయ్యారు. భూస్వామ్య విధానాలతో అణగతొక్కబడిన అణగారిన జనాల్లో తన ఆటపాటలతో చైతన్యం నింపిన యుద్ధనౌక గద్దర్‌కు కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు.

గొల్లకురుమల అభ్యున్నతికి కృషి



సుల్తాన్‌పురంలో గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

కేటీదొడ్డి: గొల్లకురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుల్తాన్‌పురంలో రెండోవిడుత మంజూరైన 6 యూనిట్ల గొర్రెలను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్లకురుమలను కేంద్ర ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదన్నారు. గొల్లకురుమలు ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ సబ్సిడీపై గొర్రెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్ఎంపీపీ రామకృష్ణనాయుడు, సర్పంచ్ రాజు, మండల అధ్యక్షుడు ఉరుకుంద, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూర్: మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. స్థానిక న్యూప్లాట్స్ కాలనీలోని బీడీ కార్మికుల కాలనీలో సోమవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఇంటింటికీ నల్లా కనెక్షన్లు, రోడ్ల మరమ్మతు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, రమేష్‌నాయుడు, అనిల్, ఖలీల్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పుల్లూరులో పశువులకు టీకా వేస్తున్న సిబ్బంది

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగల, జిల్లెడుదిన్నె గ్రామాల్లో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. స్థానిక పశువైద్యశాల డాక్టర్ పుష్పలత ఆధ్వర్యంలో 47మంది రైతులకు చెందిన 259 గేదెలు, 121 ఆవులు, ఎద్దులకు టీకాలు వేసినట్లు సిబ్బంది తెలిపారు. అదేవిధంగా నట్టల నివారణ మందులు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఎల్ఓ వరప్రసాద్, షేక్ లతీఫ్, రవి, వెంకటమ్మ, కృష్ణ, గోపాలమిత్ర నారాయణగౌడ్, సీతారామిరెడ్డి, దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడు, తక్కశీల, పుల్లూరు గ్రామాల్లో పశువలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు వెటర్నరీ డాక్టర్ శిరీష తెలిపారు. మొత్తం 108 ఆవులు, ఎద్దులు, 109 బర్రెలకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషన్‌గౌడ్, శివ, మసూమన్న పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

గద్వాల అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేకూర్చే సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు వడ్డె నాగరాజు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఈనెల 12న హైదరాబాద్‌లో చేపట్టిన బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను సోమవారం మండలంలోని ఆనంతపురం రైతువేదిక వద్ద ఆవిష్కరించారు. సభకు ఉపాధ్యాయ, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు విష్ణు, భాస్కర్, శంకర్, సుబ్రహ్మణ్యం, గోవిందునాయక్, ఉద్యానశాఖ అధికారి అక్బర్, డివిజినల్ డైరెక్టర్ సంగీతలక్ష్మి, శ్రీలత, కరుణ, రాధ, సురేందర్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి కొలతలు



అయిజలో బీటీరోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



మానవపాడులో..

మానవపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న బీటీరోడ్డు నుంచి గాంధీ చౌక్ వరకు సీసీరోడ్డు నిర్మాణానికిగానూ సోమవారం ఆర్అండ్‌బీ ఏఈ మహేష్ కొలతలు తీసుకున్నారు. రూ.95లక్షలతో సీసీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద నిర్మించిన బీటీరోడ్డును మున్సిపల్ ఏఈ గోపాల్, క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్ భరత్ పరిశీలించారు. నిబంధనల మేరకు బీటీరోడ్డు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

మల్దకల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు తిరుమల్, సురేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి బస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుమలేష్, కృష్ణ, రాయుడు, శివ, పరుశరాముడు, శాంతిరాజు, తిరుమల్ పాల్గొన్నారు.